# బ్రతుకు తెరువు

అసలే కాలేజీకి లేటు అయింది. ఎండ చిటపట లాడుతున్నది. తనకు కావలసిన బస్సు నెంబరు తప్ప మిగిలిన అన్ని నెంబరు బస్సులు విసుగూ విరామం లేకుండా పోతున్నాయి. మధుకు చిరాకుగా వున్నది. పైగా ఈ బిచ్చగాళ్ళ గొడవ ఒకటి. బస్సుకోసం తాపత్రయ పడేవాళ్ళను ఈబిచ్చగాళ్ళ బొంగురు గొంతులూ, కీచురు గొంతులూ, రాచుకపోయిన గొంతుల్లోనుండి వచ్చే ఆకటి అరుపులు మరింత చికాకు పెడతాయి. ముఖ్యంగా కుష్టువాళ్ళతోనే వుంది బాధంతా. సగం తినిపోయి చీముగారుతున్న చేతులను ముఖంలోకి పెడుతూంటే కడుపులో చెయ్యిపెట్టి దేవుతున్నట్లు వుంటుంది.

మధుకు ఇలాంటివాళ్ళంటే జాలి కలగదు. సరికదా పైగా జుగుప్స కలుగుతుంది. సగం సగం వళ్లు కుళ్లిపోయికూడ బ్రతకటానికి తాపత్రయ పడకపోతేనేమో? రోజు రోజుకూ వీళ్ళ సంఖ్య పెరిగిపోతూ వున్నది. చిన్న పిల్లలనుండి ఇదేవృత్తి. ఇలాంటివారిమీద జాలి జూపుచూ కానీ, అర్ధణా వేసి, సోమరుల లాగ తయారు చేసినంతబుద్ధితక్కువతనం కేమీ లేదు అనుకుంటాడు.

"అప్పా, ఒరు కాలనా " "కయ్యాగాలూఇల్లే " మొదలైన కేకలు రోజూ వింటూకూడ వినకపోవటం, చూస్తూ కూడా చూడకపోవటానికి అలవాటుపడ్డ మధుని తనవైపుకు తిప్పుకోలేక పోయాడు బిచ్చగాడు. వాడేనా అంతతక్కువతిన్నది ? మధుకు ఇంకా కొంచెం దగ్గరగా జరిగాడు. ముక్కులు పగిలిపోయే దుర్గంధం మధుదృష్టిని వాడి వైపు తిప్పి,

"ఛీ! దూరంగా పోరా" అన్నాడు. మధు ముక్కుకు కర్చీపు అడ్డు పెట్టుకుంటూ.

కాళ్ళనుండీ, చేతులనుండీ చీమూ, రక్తం కారుతున్న కుష్ఠురోగి కుడిమోకాలుకూ, చీలమండకూ గుడ్డ పేలికలు చుట్టుకున్నాడు. పాదాలకు పాతకాన్వాసు బూటు వేసి వుండడంవల్ల ఎన్ని వేళ్లుకరిగిపోయాయో ఎన్ని ఊడిపోయాయో తెలియటం లేదు. ఆ బూట్లుకూడా చీము రక్తముతో తడిచి అసహ్యంగా వున్నాయి. ఏ పెట్టి పుట్టిన మారాజో ఇచ్చిన భుజాలు చిరిగిన కోటూ, మోకాళ్ళ దగ్గర చిరిగి పేలికలు వేలాడుతూన్న ఖాకీ నిక్కరు వేసుకున్నాడు. మానవ సమాజంలోని — ముఖ్యంగా సభ్యసమాజంలోని పెద్దమనుష్యుల్లాగా చలామణి అయేవారి హృదయాల్లోని కుళ్లంతా ఒక ఆకారాన్ని ధరించిందా ? అనిపించింది మధుకు.

వాడు ఒకచేత్తో పొట్టను చూపిస్తూ, ఇంకోచేయి మధుముందుకు చాచి, "బాబూ ఒక కానీ" అన్నాడు.

త్వరగా ఆ కంపునుండి బయటపడేందుకు ఆలో చించకుండానే అణా బిళ్ల వేశాడు. ముఖం పక్కకుపెట్టు కొనే మధు !

" విష్ యూ హేపీ న్యూ యియర్ సార్ ! "

మధు ఉలిక్కిపడ్డాడు. పక్కన ఎవరూ తెలిసిన వాళ్ళుకూడ లేరు. బిచ్చగాడు మధుముఖంలోకి చూస్తూ చిరునవ్వు నవ్వాడు. మధు అతని కళ్ళల్లోకి ఆశ్చర్యంగా చూశాడు. ఇలాంటి భయంకర రోగానికు గురైౖ, అందరి చేత అసహ్యించుకోబడుతూ, ప్రాణం మీద తీపిని వదలు కోలేక, జానెడు పొట్టకోసం బిచ్చ వృత్తితో నికృష్ట జీవి తాలను గడిపే మామూలు బిచ్చగాళ్ళకళ్ళలో కన్పించే బాధ, దీనత్వం లేదు అతని కళ్ళలో. ఏదో సాధించాలనే తృప్తి, గర్వం తొణికిసలాడుతున్నాయి ఆ కళ్ళలో. ముఖం చూస్తూవుంటే మొత్తంమీద బతికి చెడ్డవాడుగా కన్పించాడు. ఇటువంటి భయంకర రోగానికి గురైనా అతని ముఖ వర్చస్సుగానీ, కళ్ళలోని కాంతి గానీ ఏమీ తగ్గలేదు. ఎంతో ఆకర్షవంతంగానూ, ఆరోగ్యంగానూ, కన్పించే అతని ముఖం చూస్తూంటే ఆశ్చర్యం, బాధ కలిగాయి మధుకు. అతని వయస్సు పాతిక సంవత్సరాల కంటే ఎక్కువ వుండవనుకున్నాడు. వీడు ఈ జబ్బుకు ముందు ఏమి చేస్తుండేవాడో కనుక్కోవాలనే కుతూ హలం కలిగింది.

ఒక్క చిరునవ్వుతో కొంటె చూపుతో శెలవు తీసుకుని వెనక్కు తిరిగిన బిచ్చగాడిని "ఏయ్, ఇదిగో"

అప్రయత్నంగా వెలువడిన మధు మాటలు వెనకకు మరలించాయి.

" ఏం బాబూ ? " అంటూ వెనక్కి వచ్చాడు బిచ్చగాడు

" మంచి తెలుగు మాట్లాడుతున్నావు. మీది ఏ ప్రాంతం ?" అన్నాడు మధు.

బిచ్చగాడు మధు కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. అతని చూపు తన ప్రాంతీయాభిమానాన్ని కొలుస్తున్నాయా అనిపించింది, మధు తన కళ్ళను అతనిచూపుల నుండి తప్పించాడు.

ఒక నిముషం ఇద్దరూ మౌనంగా నిలబడ్డారు.

"ఏం బాబూ నా గురించి వినాలని వున్నదా ? ఇంతవరకు నా యీ కుళ్లు జీవితాన్ని గురించి తెలుసుకోవాలని ప్రయత్నించిన వాళ్లెవరూ కన్పించలేదు. ఎవరి సుఖదుఃఖాల్లో, జీవిత సమస్యల్లో వారు ఊపిరి సల్పకుండ కాల చక్రం గిరగిర తిరిగే ఈ ప్రపంచంలో నాలాంటి వారి జీవితాలను గురించి వినటానికి, ఆలోచించటానికి ఎవరికి వోపికా తీరుబాటూ వున్నవి బాబూ ?"

"నీవు మామూలుబిచ్చగాడికంటే చాలాభిన్నంగా వున్నావు. నీ గురించి వినాలని వున్నది. " అన్నాడు మధు.

" ఇంతవరకూ నా జీవిత రహస్యాన్ని ఎవరికీ చెప్పలేదు. ఎందుకో మీకు చెప్పాలని అనిపిస్తుంది. అది చాలా పెద్ద కథ. మీరు సాయంత్రం ఆరు గంటలకు ఇక్కడ కలవండి " అన్నాడు కుష్ఠువాడు.

ఇంతలో మధుకు కావలిసిన బస్సు వచ్చింది. అనాలోచితంగానే సాయంత్రం వస్తానంటూ మధు బస్సు ఎక్కాడు.

బస్సులో ఎక్కింది మొదలూ మధుధ్యాస ఆ బిచ్చగాడి మీదనే! బాగా ఇంగ్లీషు కూడా మాట్లాడుతున్నాడు. ఇతని నికృష్ట జీవితం చాటున ఏదో నిగూఢ జీవిత రహస్యమున్నదని అతని నిశితమైన చూపులే చెబుతున్నాయి. ఇలాంటి ఆలోచనల్లోనే మధు ఆ రోజంతా పరధ్యానంగానే వున్నాడు. పాఠాల్లో అతను మనస్సును లగ్నం చేయలేకపోయాడు.

కాలేజీ వదలగానే బయలుదేరాడు — రోజూ తనతోటివచ్చే ఫ్రెండ్స్‌కొకరికికూడ ఎవరికి చెప్పకుండానే. వాళ్ళకు ఈ విషయం తెలిస్తే తన్ను పిచ్చివాడినిచేసి ఏడ్పించరే? అయినా అసలు అతను అందరికీ తన జీవిత రహస్యాన్ని చెప్పనన్నాడు గదూ? ఎందుకయినా వంటరిగా వెళితేనే మంచిదనుకున్నాడు.

మధు స్టాండు చేరేటప్పటికి ఐదున్నర అయింది. బస్సులోనుంచి దిగుతూనే ఆ బిచ్చగాడు ఎవరో పెద్దమనిషిని కానీ కోసం పీడించటం చూశాడు. మధును చూడగానే వాడు దగ్గరకు వచ్చి, "సరిగా ఆరుగంటలకు రండి" అనేసి మరల ఆ మొదటి వ్యక్తి దగ్గరికే పోయి నిల్చున్నాడు. ఆ వ్యక్తి పై ఉత్తరీయం ముక్కుకు పెట్టుకొని కొంచెం వెనక్కు జరిగాడు. బిచ్చగాడు

కొంచెం ముందుకు జరిగాడు. ఇది చూస్తున్న మధుకు నవ్వు వచ్చింది. "మొండి ఘటాలు" తనలో తనే గొణుక్కొన్నాడు.

ఇంకా అర్ధగంట టైము వున్నది. ఎదురుగావున్న 'శంకర్ కేఫ్' లో చొరబడ్డాడు మధు. ఒక జాసుందీ, ఒక మసాలా దోసెకు అర్డరిచ్చాడు. హోటలునుండి బయటకు వచ్చేటప్పటికి ఆరుంబావు అయింది.

అంతవరకూ మధుకోసమే చూస్తున్న బిచ్చగాడు "రండి బాబూ!" అంటూ గబగబా నడవడం ప్రారంభించాడు. ఎక్కడికని మధు అడగనూలేదు. బిచ్చగాడు చెప్పనూ లేదు. మధు వాడికి దూరదూరంగా వాడితోటి తనకేమీ సంబంధం లేనట్లునడుస్తున్నాడు. లేకపోతే చూచేవాళ్లంతా కుష్టువాడి వెంటపడి పోతున్న తనను పిచ్చివాడు అనుకోవచ్చు. మధు మనస్సులో విషయాన్ని గ్రహించినట్లు ఆ కుష్టువాడు దూరదూరంగా నడుస్తున్నాడు.

పచ్చయప్ప బస్ స్టాండునుంచి బ్రాడ్వేలో ప్రవేశించారు; మన్నడీకూడా దాటిపోతున్నాడు బిచ్చగాడు. మధుకు విసుగుపుడుతున్నది. కాని ఏదో పెద్ద రహస్యాన్ని 'డిస్కవరీ' చేయబోతున్నాననే ఉత్సాహం, ఆనందం అతన్నిముందుకు పోయేలా ప్రోత్సహిస్తున్నాయి.

ఏడు గంటలు కావస్తున్నది. ఇంకా నడుస్తునే వున్నారు మౌనంగా ఇద్దరూ. బ్రాడ్వేదాటి చిన్న చిన్న గొందుల్లో ప్రవేశించాడు బిచ్చగాడు. మధు ఎప్పుడూ అలాంటి ప్రదేశాలకు రాలేదు. చీకటి, మురికి దుర్గంధ

పూరితమైన ఆ సందు గొందుల్లో ప్రవేశించగానే మధుకు కడుపులో తిప్పటం ప్రారంభించింది. ఏడుగంటలన్నా కాలేదు. జనసంచారం బొత్తిగా లేదు. దూరంగా ఒక రిద్దరు సందు మలుపుల్లో కనిపించి మాయ మయారు. మధుకు ఏదో సందేహంతో కూడిన భయం కలుగుతున్నది. తను డిటెక్టివ్ నవలల్లో చదివిన దొంగలునివసించే స్థలాలు గుర్తు కొచ్చాయి. ఇంతలో రెండు కాళ్ళ సందు నుండి ఏదో పరుగెత్తింది. మధు వులిక్కిపడ్డాడు, బిచ్చగాడు నవ్వుతూ, "పందికొక్కులెండీ" అన్నాడు నిర్లక్ష్యంగా.

పందికొక్కులు ఆ గొందుల్లో అటూఇటూ స్వేచ్ఛగా పరిగెడుతున్నాయి. మధు బిక్కుబిక్కుమంటూ నడుస్తున్నాడు. మధ్య మధ్య పందికొక్కులు కాళ్ళ మధ్యకు వచ్చినప్పుడు ఎగిరి గంతులేస్తున్నాడు. తనను మోసంచేసి తీసుకొచ్చాడనే సందేహం కలగ్గానే మధువళ్ళంతాచెమట్లు పట్టింది. తనదగ్గర పార్కర్-51 ఫౌంటెన్ పెన్, రోలెక్స్ రిష్టువాచీవున్నవి. అరవటానికికూడా వీ లేదు. ఆగొందుల్లో తన అరుపులు విని రక్షించే పెద్దమనుషులు ఎవరూ వుండేట్లు కన్పించలేదు. చూస్తున్నకొద్దీ ఈ పేటంతా ఇలాంటి దొంగ వెధవలే నివసిస్తున్నట్లు తోచింది మధుకు. తిరిగి వెళ్ళాలంటే ఈ చీకట్లో తను ఎన్ని గొందులు తిరిగాడో, తిరగాలో కూడ బోధపడటంలేదు.

"ఎక్కడికి తీసుకొచ్చావు ?" అన్నాడు మధు. ఆ స్వరంలో భయం స్పష్టంగా ద్యోతక మవుతున్నది.

"ఏం, బాబూ! భయపడుతున్నారా ?" అంటు నవ్వాడు బిచ్చగాడు.

మధుకు సిగ్గు వేసింది. వాడి ప్రశాంతమైన చిరునవ్వులో, నిశితమైన చూపుల్లో, నిండైన గొంతులో వెతుకుదామన్నా మోసం తాలూకు లక్షణాలు కన్పించటం లేదు.

బిచ్చగాడు ఒక చిన్న పెంకుటిల్లుముందు ఆగాడు. ఆ సందులో వున్ననాలుగైదు యిళ్ళూ ఒకే మాదిరిగా వున్నాయి సగం సగం గోడలు పడిపోయి. సగం సగం పెంకులు పగిలిపోయి, అటు శిథిలాలూ కాకుండా, ఇటు ఇల్లు అని చెప్పటానికి వీల్లేకుండా వున్నాయి. ఆ సందులో కల్లా వీడు తలుపు కొడుతున్న యిల్లే కొంచెం యింటి ఆకారంలో వున్నట్లు అనిపించింది మధుకు.

లోపలనుండి "వస్తున్నా" అని ఒక మధురకంఠం విన్పించింది. మధుకు అంతా అయోమయంగావున్నది. ఈ బిచ్చగాడు తనను ఎవరింటికి తీసుక వచ్చిందీ, ఎందుకు తీసుక వచ్చిందీ అర్థం కావడం లేదు. మంత్రముగ్ధుడిలా కొయ్యబారిపోయి, అతని ప్రక్కనే నిల్చున్నాడు.

తలుపులు తెరుచుకున్నాయి. ఒక యిరవయ్యేసంవత్సరాల అందమైన యువతి తలుపు తెరిచింది. ఆమె కట్టూ బొట్టూ చూస్తే చదువుకున్న మంచి కుటుంబంలోని యువతిలాగా వున్నది. ఇలాంటి యువతికి ఈ సందులో, ముఖ్యంగా ఈ కుష్ఠువానితో సంబంధం చూస్తే యింకా ఆశ్చర్యంగా వున్నది.

ఆమె యిద్దర్నీ చిరునవ్వుతో ఆహ్వానించింది.

"బాబుగార్ని కూర్చోబెట్టు, నేను యిప్పుడే వస్తా" నంటూ మధు సమాధానానికి కూడ ఎదురుచూడకుండా యింటి వెనక్కు వెళ్ళిపోయాడు బిచ్చగాడు.

మధుకు చెమట్లు పోస్తున్నాయి. ఏవేవో సందేహాలు అతని హృదయాన్ని ఆవహిస్తున్నాయి. చలన రహితంగా నించున్నాడు.

"లోపలికి వచ్చి కూర్చోండి" అన్న ఆ యువతి పిలుపుతో వులిక్కి పడి, ఆమె వెనుకనే ఇంట్లో ప్రవేశించాడు మధు.

లోపల చిన్న హాలూ, హాలుకు రెండు ప్రక్కలా రెండు చిన్న గదులూ వున్నాయి. హాలులో రెండు కుర్చీలూ, ఒక టేబులూ వున్నవి. మధును కూర్చోమని ఆమె లోపలికి వెళ్ళింది.

మధు కుర్చీలో కూలబడ్డాడు. భయం భయంగా నలువైపులా కలయచూశాడు. మామూలు గృహస్తుల యింటికి తగ్గ హంగులన్నీ వున్నాయి. టేబుల్ మీద కొన్ని యింగ్లీషు తెలుగు పుస్తకా లున్నాయి. ఇదంతా ఏదో ఇంద్రజాలం లాగ వున్నది.

ఇప్పుడు మధుకు కొంచెం కొంచెంగా అర్థమవుతూంది. ఈమె ఎవరు ? చూట్టానికైతే మంచి కుటుంబంలోని యువతిలాగా వున్నది. ఈ వృత్తిలోకి ఎందుకు దిగిందో ? బిచ్చగాడు ఎవరు ? బహుశా వాడికిది సైడ్ బిజినెస్ అయివుంటుంది. దొంగ వెధవ! ఒక్కమాట కూడ మాట్లాడకుండా తప్పుకున్నాడు. మళ్లీ బస్ స్టాండులో

కన్పించక పోతాడా? ఇలా ఆలోచిస్తుండగానే ఆమె కాఫీ గ్లాసు తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

మధు తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె కూడ ఆశ్చర్యంగా అతని ముఖంలోకే చూస్తున్నది. మధు తన కళ్ళను నమ్మలేక పోయాడు, అతని నోటి నుండి అప్రయత్నంగా "సరళా!" అన్న మాటలు వెలువడ్డాయి!

"మధూ! నీవేనా?" అన్నది సరళ. ఆమె స్వరంలో ఎలాంటి ఉద్రేకంగానీ, వుద్వేగంగానీ లేదు. ఒక రకమైన వుదాసీనత మాత్రం ద్యోతక మవుతుంది.

మధుగుండెల్లో రైళ్ళుఢీకొన్నాయి. రక్తనాళాల్లో రక్తం పురకలు తీస్తున్నది. తల దిమ్మెత్తిపోయింది. అదురుతున్న కణతలను పట్టుకొని కళ్ళుమూసుకున్నాడు.

కళ్ళముందు నాలుగు సంవత్సరాల క్రిందటి స్మృతులు కదలసాగాయి. అవును, యీమె తన సరళ. ఒకప్పుడు ఈమెలేనిదే జీవితం లేదనుకున్నాడు. ఈమెను తనప్రాణంకంటేఎక్కువగా ప్రేమిస్తున్నా ననుకున్నాడు తను గుంటూరులో "ఫస్ట్ ఇయర్" చదివే రోజుల్లో సరళతో పరిచయం కలిగింది. ఆమెతో సరదాగా కబుర్లు చెప్పటానికి, సినిమాలకు వెళ్ళటానికి కష్టమని పించలా. పైగా ఆ సంవత్సరం అంతా ఎంతో వుత్సాహంగా దొర్లిపోయింది. వచ్చిన చిక్కల్లా పెండ్లి సమస్య వచ్చినప్పుడే. తల్లిదండ్రులను ఎదిరించి బీద పిల్లను చేసుకొనే ధైర్యం తనకు లేదు! చివరికి ఎవరికీ చెప్ప

కుండా ఒకనాటి రాత్రి రైల్వే స్టేషన్‌కు వెళ్ళిపోయాడు పెట్టా, బెడ్డుతో సహా.

ఆ తరువాత సరళ విషయం తనకేమీ తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నించనూ లేదు. అప్పుడప్పుడూ ఆమె గుర్తురావటం, ఏదో కొంచెం బాధగా ఫీలవడం, జరిగేది. ఈ మధ్య అదికూడ లేదు.

కాని తను సరళను యిలాంటి స్థితిలో చూస్తానని కలలో కూడ ఊహించలేదు. జీవితంనుండి యింత నీచంగా దిగజారిపోతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎదురుగా కూర్చుని తననే నిశితంగా, నిశ్చలంగాచూస్తున్న సరళను చూడగానే అతనిక కోపం, అసహ్యాం, కలిగాయి. ఇటువంటి నీచురాలనేనా తను ప్రేమించింది! ఇక ఆలోచించలేకపోయాడు.

" ఈ వృత్తి ఎప్పటినుండి ? "

" బ్రతకనేర్చినప్పటినుండి " తొణకని స్వరంతో గర్వంగా జవాబిచ్చింది.

" పెండ్లి చేసుకోలా ? " మధు స్వరంలో యీసడింపు స్పష్టంగా తెలుస్తున్నది.

" చేసుకున్నాను "

" నీ భర్త ఏం చేస్తున్నాడు ? ఎందుకూ పనికిరాని వెధవలాగున్నాడు. లేక పోతే...."

"ఇక చాలు. అనవసరంగా ఆయన్ను ఏమీ అనకు. ఆయన చాలా మంచివాడు. నీ పరిచయంతో నాకు మగవాళ్ళంటే అసహ్యాం. అవిశ్వాసం ఏర్పడ్డది. కానీ నా భర్త అందరు మగవాళ్ళూ పిరికిపందలూ, మోసగాళ్ళూ కారని నిరూపించారు.

" అయితే నీ భర్త అతను .... "

" ఆఁ! ఆ కుష్ఠువాడే! అతనే నా భర్త. "

" సరళా! ఎంత పని చేశావు? నీ జీవితాన్ని నాశనం చేసుకున్నావు, ఎవర్ని సాధించటానికి?" మధు స్వరంలోం జాలి పుట్టిపడుతూంది.

" ఉఁ ఎవర్ని సాధించటానికీ కాదు. ఒకర్ని ఒకరు సాధించే హక్కు ఎవరికీ ఎవరూ యివ్వలేదు. నా జీవితంలో ప్రవేశించి సహాయ సానుభూతులతో ఓ చేయి అందించాడు. ఆ చేయి అందుకున్నాను. అంతే! "

" కాని అది దుర్గంధపూరితమైన కుష్ఠు చెయ్యి. "

"కావచ్చు, కాని అతని హృదయంలో ఆ కుష్ఠు తాలూకు దుర్గంధం లేదు. ఆ హృదయంలో ఆత్మ విశ్వాసం. జీవితం మీద నమ్మకం వున్నది. కాని నీలాంటి వారి హృదయాలు కుష్ఠుతో కుళ్ళి పోతున్నాయి. మొదటిసారిగా నా జీవితంలో ప్రవేశించి, నమ్మించి మోసం చేసినావు. పెళ్ళి చేసుకుంటే పెళ్ళాన్ని పోషించాల్సిన భారం మీద పడుతుందని పిరికిపందలా పారిపోయావు. ఆత్మవంచకులూ, పిరికిపందలూ అందించే చీమూ, రక్తంలేని చేతులకంటే, ఆ కుష్ఠు చెయ్యి ఎంతో మేలు. " సరళ వుద్రేకంతో మాట్లాడుతున్నది. కళ్ళు అపూర్వ కాంతితో మిలమిలలాడుతున్నాయి.

వింటూంటే మధుకు సిగ్గూ, బాధ కలుగుతోంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతుపూడిపోయింది. ఇంతలో ఎవరిదో బలమైన చెయ్యి వెనుకనుండి మధు భుజంమీద

పడ్డది. మధు కరంటుషాక్ తిన్నవాడిలాగ కుర్చీనుండి లేచి నిల్చున్నాడు. అదే ముఖం, అదే చిరునవ్వు చిందులాడే పెదాలు, అవే తిరస్కారంతో కూడిన తీక్షణమైన చూపులూ, ఆ కుష్ఠువాడే. తెల్లని షర్టూ, ధోవతీ కట్టుకున్నాడు. మధు అదుర్దగా, గాబరాగా చేతులవంకా కాళ్ల వంకాచూశాడు, కానీ ఆచేతులూ ఆ కాళ్ళూ కుష్ఠువాని చీమూ రక్తంతో కూడిన చేతులూ, కాళ్ళూ కావు. మధుస్థితి అయోమయంగా వున్నది.

మిష్టర్ ! గాబరాపడకు. అవన్నీ బ్రతుకు కోసరం వేసే వేశాలే." అంటూ చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టాడు ఆ వ్యక్తి.

" కాఫీగ్లాసు అందిస్తూ తాగండి" ఆరి పోతుంది. మిమ్మల్ని చాలా సస్పెన్స్‌లో పెట్టి బాధ పెట్టామనుకుంటా" అన్నాడు రాజారావు రెండో కుర్చీలో కూర్చుంటూ !

మధు చెవుల్లో ఆమాటలు గింగురుమంటున్నాయి. బరువెక్కిన చేత్తో కాఫీ కప్పును అగదుకున్నాడు.

"ఈమె సరళ, నా భార్య" అన్నాడు రాజారావు.

"ఆమె నాకు తెలుసు" అన్నాడు మధు కాఫీ కప్పునుండి ముఖాన్ని ఎత్తకుండానే.

అవును ఆ విషయం నాకూ తెలుసు. సరళ అంతా చెప్పింది. సరళదగ్గర మీఫొటో కూడావున్నది. మిమ్మల్ని గుర్తించే యిక్కడకు తీసుకవచ్చాను" అన్నాడు రాజారావు.

మధు తల సిగ్గుతో యింకా కిందకు దించుక పోతున్నది.

ఈ విషయాన్ని గ్రహించిన రాజారావు "కాఫీ తాగండి" అన్నాడు.

ఇంతలో పక్కగదిలోనుండి పసిపిల్ల ఏడ్పు విన్పించింది. రాజారావు లేచి వెళ్ళాడు. మధు సరళ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. సరళ చిరునవ్వుతోనే జవాబిచ్చింది. ఆనవ్వులో మాతృస్నేహం నిండివున్నది.

"ఇంత కుళ్ళు జీవితాన్ని ఎలా గడుపుతున్నారు?"

"చెప్పాగా, బ్రతుకుమీద ఆశ, భవిష్యత్తుమీద నమ్మకంతోనే నని। మొదట ఆయనా బాధపడ్డారు. ఉపాయం చెప్పిన పక్కింటి ముసలివాడు కూడ యిలాగే బ్రతుకుతున్నాడు. పాలు లేక ఎండిపోయి కొనప్రాణా లతో వున్న బిడ్డను, తిండి లేక నీరసించి మంచం పట్టిన పెళ్ళాన్ని పోషించవలసిన బాధ్యతను గుర్తు చేసుకొని ఇంత బాధాకరమైన పనిని చేస్తున్నారు. నేటి సమాజం లోని మనుష్యుల కఠిన హృదయాలు కుళ్ళును చూపిస్తే కాని కరగడంలేదు."

ఇంతలో రాజారావు పండంటి కొడుకును ముద్దు లాడుతూ బయటకు వచ్చాడు.

ఆ పిల్లవాడిని చేతుల్లోకి తీసుకుంటూ ఆలోచిస్తు న్నాడు. "యిలాంటి పిల్లవాడిని, సరళలాంటి భార్యను ఆకలిమంటలనుండిరక్షించటానికి తనైతే ఏ చేసి వుండేవాడు". ఎంత ఆలోచించినా జవాబు దొరకలేదు మధుకి.